మధ్యాహ్నం నేను నా భోజనం ముగించి వచ్చేస్తున్నప్పుడు ... అత్తయ్య గుమాస్తా ఇచ్చిన మందుల కవరుని తీసుకుని తన గదిలోకి వెళ్ళబోతూ కాలికి చీర అడ్డం తగలటం వలనో మరెందుచేతనో ముందుకు తూలి పడబోయారు. దగ్గిరలోనే ఉన్న నేను చటుక్కున పట్టుకుని అప్రయత్నంగా "అత్తమ్మా..." అన్నాను.

ఒకే ఒక సెకను సేపు నిర్విణ్ణురాలైనట్లుగా నా వేపు చూసిన అత్తయ్య "వద్దు... నన్నలా పిలవొద్దు..." రుద్ధ కంఠంతో అంటూ వేగంగా లోపలకి వెళ్ళిపోయారు.

చిన్నతనంలోనే 'అమ్మ' అనే పిలుపుకు దూరమై పోయినందువలనేమో పెళ్ళాయ్యాక అత్తగారికే 'అమ్మ' అని చేర్చి 'అత్తమ్మ' అని పిలవాలని మనసులో అనుకునేదాన్ని. అందువల్లనే అనుకుంటా అనుకోకుండానే ఆ మాట నా నోటి వెంట వచ్చింది.

ఈ మాత్రానికే అత్తయ్యకు అంత దుఃఖం ఎందుకు వచ్చింది?.... నేను వరసపెట్టి పిలవటాన్నే అత్తయ్య సహించలేకపోతోందంటే... నా మీదెంత అయిష్టత ఉందో తెలుస్తోంది! అత్తయ్య చూపులో.. నా పట్ల కోపం, కాఠిన్యం కనుపించవు... ఏదో నిర్లిప్తత, వేదన తొంగి చూస్తుంటాయి! నా తప్పేమిటో నాకర్థం కావటం లేదు.

షాక్ తగిలినట్లుగా ఒక క్షణం అక్కడే బొమ్మలా నిలబడిపోయిన నేను తేరుకుని మెల్లగా నా గదిలోకి వచ్చాను.

అత్తయ్య నన్ను పలుకరించలేదని, నేనూ రోషంతో దూరంగా ఉండిపోవటం సమంజసం కాదని దగ్గరయ్యే ప్రయత్నం చేయాలని నిన్ననే నేను అనుకున్నాను. అలాంటి ప్రయత్నాలేవీ ఫలించవని ఈ రోజు తేట తెల్లమైపోయింది!

అప్పుడొకసారి విష్ణు నాకు కొన్ని విషయాలు చెప్పాలనీ, సమయం చూసి చెబుతానని అన్నారు. తీరుబడిగా ఉన్నప్పుడు ఆ మాట గుర్తు చేయాలి. అత్తయ్యకు నా పట్ల ఉన్న అయిష్టతకు కారణం తెలుస్తుందేమో...!

నాన్నగారి దగ్గర్నుండి ఫోన్ వస్తే... మనసులోని దుఃఖం గొంతులో కనుపించకుండా మాట్లాడటానికి కొంచెం కష్టపడాల్సి వచ్చింది! ఎప్పటిలానే బావున్నానని, ఇక్కడ అంతా బావుందనీ చెప్పాను. విష్ణుతో నాకు నిజంగానే హాయిగా, అంతా బావుంది కాబట్టి అలా నిస్సంకోచంగా చెప్పగలుగుతున్నాను. అత్తయ్య ఇప్పటివరకూ నన్ను పలుకరించలేదనే విషయం తెలిస్తే... నాన్నగారెంత ఆందోళనకు గురవుతారో ఊహించగలను! ప్రస్తుతానికీ విషయాలు నాన్నగారికి తెలియకపోవటమే మంచిదనే ఉద్దేశ్యంతో ఇక్కడికి ఎప్పుడు వస్తారని మాట మాత్రంగానైనా అడగటానికి సాహసం చేయలేకపోతున్నాను.

* ❀ *

నాలుగు గంటల సమయంలో నీరజ ఒక ఆల్బమ్ తీసుకుని నా దగ్గరకు వచ్చింది. శ్రీలక్ష్మి గురించి చెబుతానని, చూపిస్తానని అన్న మాట గుర్తుకు వచ్చింది. ఫోటోనా అనుకుంటూ ఆల్బమ్ తెరిచాను.

మామిడికాయలు గుత్తులుగా వేళ్ళాడుతున్న గున్న మామిడి చెట్టుక్రింద .. పట్టులంగా ఓణీ డ్రెస్సులో, నిండుగా అన్ని నగలూ పెట్టుకున్న అమ్మాయి ఫోటో మొదటి పేజీలో ఉంది.

నేను ఎప్పుడో ఎక్కడో చదివిన వాక్యం చటుక్కున గుర్తుకు వచ్చింది.

స్థంభించిన విద్యుల్లత... దిగివచ్చిన దేవత!

నేనలా కళ్ళార్పకుండా చూస్తుంటే "శ్రీలక్ష్మి" అంది నీరజ.

"శ్రీలక్ష్మి ఎవరు...?" ఉద్వేగంతో అడిగాను.

"కోదండం మామయ్య కూతురు" అంది.

# 7

నేను ఆల్బమ్ పేజీలన్నీ చకచకా తిరగేశాను.

ఇంట్లో వాళ్ళు అత్తయ్య మామయ్యలతో పాటు, నాకు తెలియని ఎవరెవరితోనో కలిసి ఉన్న శ్రీలక్ష్మి ఫోటోలు చాలానే ఉన్నాయి. నగలతో లంగా ఓణీ, చీరెలాంటి సాంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా రకరకాల మోడ్రన్ దుస్తుల్లో ఉన్న ఫోటోలూ ఉన్నాయి. పండుగలు, పుట్టిన రోజుల పార్టీలపుడూ అలా రకరకాల సందర్భాల్లో తీసినవనుకుంటాను. వీణ వాయిస్తూ... హాలులోని మెట్లమధ్యలో నిలబడి కొంచెంగా వెనక్కి తిరిగి చిరునవ్వుతో చూస్తూ.. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని తల ఎత్తి పెద్దగా నవ్వుతూ... పూల మొక్కల మధ్య చిలిపి నవ్వుతో... అలా ఎన్నెన్నో భంగిమల్లో ఉన్న ఆ ఫోటోలన్నీ శ్రీలక్ష్మి అపురూపమైన అందాన్ని పట్టి చూపిస్తున్నాయి. శ్రీలక్ష్మి నవ్వులో, కళ్ళల్లో ఏదో సమ్మోహన శక్తి ఉంది!

"శ్రీలక్ష్మి ఇపుడు ఎక్కడ ఉంది?" ఆల్బమ్ మూసేస్తూ అడిగాను.

"ఆ కథే చెబుతాను..." అంటూ నిట్టూర్చింది... "నేను చూసినవే కాదు, విన్నవీ అన్నీ కలిపి చెబుతాను..." అంది.

“అమ్మా వాళ్ళది ఇక్కడికి కొంచెం దగ్గరలో ఉండే చెన్నూరు. అమ్మా పెద్దమ్మల అన్నయ్య అంటే.. కోదండం మామయ్య. ఆ ఊళ్ళోనే ఉంటాడు. జానికత్తయ్య పురిటికని వాళ్ళ పుట్టింటికి వెళ్లిన రోజుల్లో అక్కడికి వెళ్ళిన మామయ్య అత్తయ్యకు కొంచెం నలతగా ఉందని హాస్పటల్‌లో చూపించటానికని వెంట బెట్టుకుని ముందుగా పెద్దమ్మా వాళ్ళింటికి వచ్చాడు. హాస్పటల్‌కి బయలుదేరుతూండగానే అత్తయ్యకు ఇంట్లోనే ప్రసవం అయిపోయింది. అమ్మాయి పుట్టింది.

ఆ రోజు పెదనాన్నకి ఒక మంచి కబురు అందింది. ఒక పెద్ద కంపెనీ కంట్రాక్టు దక్కింది. పెద్ద పెద్ద వాళ్ళు పోటీపడుతున్న ఆ కంట్రాక్టు తనకి రాదని పెదనాన్న ఆశ వదులుకున్న సమయంలో అనుకోని విధంగా అదృష్టం కలిసివచ్చింది. ఇంట్లో ఆడపిల్ల పుట్టిన వేళా విశేషమనే అందరూ అనుకున్నారు.

రెండేళ్ళ తర్వాత జానికత్తయ్యకు మళ్ళీ ఆడపిల్లలు కవలలు పుట్టారు. అత్తయ్యకు అందర్నీ చూసుకోవడం కష్టమౌతుందని పెద్దమ్మాయిని తన దగ్గరకు తీసుకువచ్చింది. అలా రెండేళ్ళ వయసు నుండే శ్రీలక్ష్మి పెద్దమ్మ దగ్గర పెరిగింది. అపుడపుడూ చెన్నూరు వెళ్ళి వస్తూండేది. చెన్నూరులో శ్రీలక్ష్మి నాలుగురోజులెక్కువ ఉన్నా పెద్దమ్మ బెంగ పెట్టుకుని వెంటనే తీసుకువచ్చేసేది.

ఇక పెదనాన్నయితే... శ్రీలక్ష్మి ఎదురురాందే బయటకు కదిలేవారే కాదు. శ్రీలక్ష్మి ఎప్పుడూ పట్టుబట్టలతో, నిండుగా నగలతో కళకళలాడుతూ కనుపించాలని అనేవారు. శ్రీలక్ష్మి పుట్టినప్పటి నుండీ పెదనాన్న ఏ బిజినెస్‌లోకి ప్రవేశించినా తిరుగులేకుండా అయింది. పట్టిందల్లా బంగారమైంది! దీంతో పెదనాన్నలో శ్రీలక్ష్మి తమ ఇంటిలో పుట్టినందువల్లే, తను ఎదురుకావటం వల్లనే అలా కలిసి వస్తున్నదనే సెంటిమెంటు బాగా స్థిరపడిపోయింది!

శ్రీలక్ష్మి కొంచెం అలిగినట్టుగా కనిపించినా పెదనాన్న హైరానా పడిపోయి... కారణం తెలుసుకుని, ఆ కోరిక క్షణాలమీద తీర్చేవారు. ఆడింది ఆట,... పాడింది పాట అంటారే, అలా అంత అల్లారుముద్దుగా పెరిగింది. వీణ నేర్చుకోవాలనుందని శ్రీలక్ష్మి మాటవరసకు అనగానే సాయంకాలానికల్లా వీణ, సంగీతం మాష్టారు ఇంట్లో సిద్ధం! కాకపోతే ఆ సంగీత సాధన ఎన్నాళ్ళో జరగలేదు... మానేసింది.

శ్రీలక్ష్మి కాలేజిలో చేరిన సంవత్సరం పెద్దమ్మ ఆరోగ్యం పాడయింది. మోకాళ్ళు వాచి అటూ ఇటూ కూడా తిరగలేకపోయేది. కొన్ని నెలల పాటు మందులు వాడుతూ

మసాజ్ చేయించుకోవాలని అన్నారు. పెదనాన్న నర్సుని ఏర్పాటు చేస్తానంటే శ్రీలక్ష్మి తనే దగ్గరుండి చూసుకుంటానంటూ కాలేజి మానేసింది. ఎవరెంత చెప్పినా వినలేదు. చదువులో ఒక సంవత్సరం వెనకబడినందువల్ల నష్టమేమీ లేదని, పెద్దమ్మని దగ్గరుండి చూసుకోవటమే తనకి సంతృప్తినిస్తుందని చెప్పి అలాగే చేసింది. వేళకి మందులివ్వటం, వాపులున్న చోట తైలంతో మర్దనా చేయటమే కాకుండా కాలక్షేపానికి పుస్తకాలు చదివి వినిపించటం, ఇష్టమైన భక్తిగీతాల్నీ పాడటం... అలా రోజంతా పెద్దమ్మనే అంటి పెట్టుకుని ఉండేది.

శ్రీలక్ష్మి ఇంట్లో ఉంటే ఇల్లంతా నవ్వులతో మారుమ్రోగుతున్నట్లుగా ఉండేది! ఎపుడూ ఏవో అల్లరి పనులు, తమాషాలు చేస్తుండేది.

ఒకసారి ఉదయం బాగా కడుపు నొప్పిగా ఉందని చెప్పింది గానీ హాస్పటల్‌కి వెళ్దామంటే వినలేదు. ఆ వాతావరణం నచ్చదని పెదనాన్న ఫ్రెండు డాక్టరు రమణరావుగారికి ఫోన్ చేసి 'నాకు చాలా భయంగా ఉంది అంకుల్... మీ హాస్పటల్ పనులు ఇంకెవరికైనా అప్పచెప్పి ఈ రోజంతా నా దగ్గరే ఉండేట్లుగా రండి...' అని రిక్వెస్టు చేసింది. ఆయన హడావిడిగా అలాగే రోజంతా ఉండేట్లుగా వచ్చేసరికి శ్రీలక్ష్మి 'నొప్పి ఏం లేదు... అంతా తమాషానే' అంటూ లేచి కూర్చుంది.

'నిన్న మా మామయ్య ఈ రోజు ఖాళీగా ఉంటానని, ఇద్దరం కలిసి కాలక్షేపం చేద్దాం రమ్మని పిలిస్తే, 'అలాంటి కోరిక నాకూ ఉందిగానీ కుదిరేట్లు లేద'ని సమాధానం చెప్పేస్తారా?' అని డాక్టరుగారిని శ్రీలక్ష్మి దబాయించి తర్వాత 'మీరు ఎపుడూ హాస్పటల్ డ్యూటీకే అంకితమైపోతే ఎలా... అపుడపుడూ అయినా ఆటవిడుపులా సరదా కాలక్షేపం ఉండొద్దూ...?' అంటూ నవ్వేసింది.

రమణరావుగారు కూడా నవ్వుతూ నిజమేనని అంగీకరించారు. పెదనాన్నతో చెస్ ఆడుతూ కాలక్షేపం చేసి సాయంకాలానికి డాక్టరుగారు ఇంటి కెళ్ళారు.

బంధువులకీ, పెద్దమ్మ పెదనాన్నల స్నేహితులకీ అందరికీ శ్రీలక్ష్మి అంటే అభిమానమే! పనివాళ్ళందరూ కూడా ఆప్యాయంగా 'చిన్నమ్మ' అని పిలిచేవాళ్ళు. వాళ్ళ కష్టసుఖాలన్నీ శ్రీలక్ష్మికే చెప్పుకునే వాళ్ళు. పెదనాన్న దగ్గర శ్రీలక్ష్మి మాటకి తిరుగు ఉండదని వాళ్ళకీ తెలుసు. శ్రీలక్ష్మి కూడా వయసుకి చిన్న అయినా ఎంతో బాధ్యతగా వాళ్ళందరి అవసరాలు కనిపెట్టి చూసేది.

అందరూ కలిసి కూర్చున్నపుడు, భోజనాలు చేసేటపుడు చిన్నన్నయ్య, శ్రీలక్ష్మి పోటీపడి జోక్స్ చెబుతూ ఎంత సందడి చేసేవాళ్ళో! ఆ రోజుల్లో... బంధువులు, స్నేహితులు రాకపోకలతో శ్రీనిలయం ఎంత కళకళలాడేదో....!

నీరజ నిట్టూరుస్తూ మౌనంగా ఉండిపోయింది.

నాకు అర్థం కాలేదు. "శ్రీలక్ష్మి ఇపుడు... ఎక్కడ ఉంది?" ఆతృతగా అడిగాను.

"శ్రీలక్ష్మి లేదు.. చనిపోయింది" బొంగురు గొంతుతో అంది.

నేను షాక్ తగిలినదానిలా ఉలిక్కిపడ్డాను. "అదేమిటి.. అంత చిన్న అమ్మాయికి అనారోగ్యం ఏమిటి...?" అయోమయంగా చూస్తూ అడిగాను.

నీరజ ఇంకొక తూటా పేల్చింది.

"ఆత్మహత్య చేసుకుంది" జలజలా రాలిన కన్నీళ్ళను తుడుచుకుంది.

"ఆ..త్మ.. హ...త్యా...?!" నా గొంతు పెగలలేదు. మాట చాలా మెల్లగా నూతిలో నుండి వచ్చినట్టుగా కీచుగా వచ్చింది.

అవును అన్నట్లుగా నీరజ నిర్లిప్తంగా తలవూపింది.

ఏ లోటూ లేకుండా ఇంతమంది మధ్య అంత అపురూపంగా పెరిగిన శ్రీలక్ష్మికి ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చింది...?!

నా చూపుల్లోని ప్రశ్నను చదివిన నీరజ మళ్ళీ మెల్లగా మొదలు పెట్టింది.

"శ్రీలక్ష్మి పుట్టిన నాడే పెదనాన్న 'మా విష్ణుకు భార్య పుట్టింది... విష్ణుకు తగ్గట్టుగా 'శ్రీలక్ష్మి' అని నామకరణం కూడా చేసేసినట్లే... నువ్వు కాదనకూడదు'... అంటూ కోదండం మామయ్యతో అంటే, మామయ్య కూడా ఆనందంగా అంగీకరించాడు.

శ్రీలక్ష్మిని బంధువులు, తెలిసినవాళ్ళు అందరూ ఈ ఇంటి కాబోయే కోడలనే అనుకునే వాళ్ళు. ఈ విషయంలో ఎవరికీ ఎపుడూ సందేహమే రాలేదు. ఒక్కసారి మాత్రం..." అంటూ నీరజ ఒక నిముషం ఆగింది.

"పెదనాన్నకి మునుపటి హుషారు తగ్గి కొంచెం అనారోగ్యంగా ఉండటంతో విష్ణు అన్నయ్యకే బిజినెస్ వ్యవహారాలని కొంచెం కొంచెంగా అప్ప చెబుతున్నారు. ఆ రోజు పనిమీద బయటకు వెళ్తున్న అన్నయ్యను వచ్చేటపుడు చెన్నూరులో వున్న శ్రీలక్ష్మిని తీసుకురమ్మని పెద్దమ్మ పురమాయించింది.

ఆరోజు ఇక్కడే మా బంధువుల్లో బాగా పెద్దావిడ... నారాయణమ్మ మామ్మ ఉంది. అన్నయ్య, శ్రీలక్ష్మి కారు దిగివస్తోంటే, హాల్లో కూర్చున్నావిడ లేచి గుమ్మం దగ్గరకు ఎదురెళ్ళి 'ఇద్దరూ రతీ మన్మధుల్లా చూడ ముచ్చటగా ఉన్నారు. మీ పెళ్ళి వరకూ నేను ఉంటానో ఉండనో... ఇపుడే పేర్లు చెప్పి లోపలకు రండి... నా ముచ్చట తీరుతుంది' అంది సరదాగా నవ్వుతూ.

ఎందుకోగానీ అన్నయ్యకు చిరాకు వచ్చింది. "ఎందుకు మామ్మా... పిల్లలకి చిన్నప్పటి నుండీ వరసలు కలిపి వాళ్ల మనసులకి సంకెళ్ళు వేయాలని అనుకుంటారు? వాళ్ల ఇష్టాయిష్టాలు ఎలా ఉంటాయోనని ఎందుకు ఆలోచించరు...?" అంటూ అన్నయ్య లోపలకు వెళ్ళిపోయాడు.

శ్రీలక్ష్మి మొహం చిన్నబోయింది కానీ ఏం మాట్లాడలేదు. శ్రీలక్ష్మి లోపలకు వెళ్ళాక మామ్మ "మీరీమధ్య అభిప్రాయం మార్చుకున్నారని నాకు తెలీదు. చిన్నప్పటి నుండి అనుకుంటున్న సంగతేకదాని సరదాకి అలా అన్నానంతే..." అంటూ నొచ్చుకుంది.

"మేం నిశ్చయించటమే కాదు, వాళ్ళిద్దరికీ కూడా ఒకరంటే ఒకరికి ప్రాణం! ఏదో ప్రయాణపు బడలికలో ఉండి... ఇలాంటివెందుకని అలా అన్నాడు..." అంటూ పెద్దమ్మ సర్ది చెప్పింది.

ఆ తర్వాత పెద్దమ్మ అన్నయ్యని "పెద్దావిడ సరదాగా ఏదో అంటే ఏం పోయింది, పెళ్ళికి ముందే ఇలాంటివి ఇష్టం ఉండదని మెల్లగానే చెప్పొచ్చుగా, చిరాకెందుకూ?" అంటూ మందలించింది. అన్నయ్య మౌనంగానే ఉండిపోయాడు. అపుడు కూడా శ్రీలక్ష్మిని పెళ్ళి చేసుకోవాలనే అభిప్రాయం లేదనే మాట చెప్పలేదు.

ఆ తరువాత పెదనాన్న వైద్యం కోసం పెద్దమ్మ, పెదనాన్న కేరళ వెళ్ళారు. అపుడు శ్రీలక్ష్మి చెన్నూరులో ఉంటే పిలిపించి ఇక్కడ ఉంచారు. వారం రోజుల తర్వాత తిరిగి వచ్చిన పెద్దమ్మ శ్రీలక్ష్మిని చూసి 'ఆరోగ్యం బాగా లేదా?' అంటూ కంగారు పడి డాక్టరుని పిలిపించారు. మామూలు నీరసమేనని కంగారు పడాల్సిందేం లేదని డాక్టరు చెప్పేవరకూ ఇద్దరూ స్థిమిత పడలేదు. 'వైద్యం కోసం వెళ్ళేటపుడు నువ్వెందుకని అనుకున్నాగానీ ఒంటరిగా ఈ ఇంట్లో ఉండటానికి ఇంత బెంగపడుతావనుకోలేదే.. ఇక నిన్ను తీసుకెళ్ళకుండా నేను కూడా ఎక్కడికీ వెళ్ళను .. సరేనా...' అంటూ పెద్దమ్మ శ్రీలక్ష్మికి మాట ఇచ్చింది. "ఆ మరునాడే... " నీరజ తలవొంచుకుని చేతిగోళ్ళవేపు చూసుకుంటూ ఆగిపోయింది.

నేను నీరజ చేయి పట్టుకుని "ఆగిపోయావేం...?" అడిగాను.

"ఆ రోజు గుర్తుకువచ్చేసరికి మాట రావటం కష్టంగా ఉంది... చెబుతాను..." అంటూ మళ్ళీ ఒక నిముషం ఆగింది.

"పెద్దమ్మ పేర వచ్చిన కవరును తీసుకుని నేను వెళ్ళేసరికి శ్రీలక్ష్మికి పెద్దమ్మ జడవేస్తోంది. శ్రీలక్ష్మికి జడవేయటం పెద్దమ్మకి ఇష్టమైన అలవాటు. 'అత్తమ్మా...' అంటూ ఏదో చెప్పబోయిన శ్రీలక్ష్మి మాటలు ఆపేసింది. పెద్దమ్మని చిన్నపుడు అత్తా, అత్తయ్యా.... అని పిలిచేది. కొంచెం పెద్దయ్యాక 'నువ్వు అత్తవే అయినా నన్ను అమ్మలా పెంచుతున్నావు కాబట్టి నిన్ను 'అత్తమ్మా' అని పిలుస్తాను...' అంటూ అలానే పిలవటం మొదలుపెట్టింది.

నేను తెచ్చిన కవరును శ్రీలక్ష్మి కిచ్చి పెద్దమ్మ చదవమంది.

అది విష్ణు అన్నయ్య రాసిన ఉత్తరం. 'ఫోను చేయకుండా ఉత్తరం రాశాడేమిటీ... వాడికి అంత ఓపికెలా వచ్చిందీ.. ఏదో విశేషమే ఉండి వుంటుంది. ఫోనులో అయితే నేను చెప్పే సమాధానం వెంటనే చెప్పేస్తానని... అది ఇష్టం లేకే ఉత్తరం రాశాడు కాబోలు... ' పెద్దమ్మ స్వగతంలా అనుకుంది.

శ్రీలక్ష్మి ఉత్తరం చదువుతూంటే పెద్దమ్మ, నేను తెల్లమొహాలేసాం.

సుజన అనే అమ్మాయిని ఇష్టపడుతున్నానని, పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నట్లుగా రాసి, ఒకటి రెండు రోజుల్లో ఇంటికి వచ్చినపుడు అన్ని వివరాలూ చెబుతానన్నాడు.

'నీకు తమాషాలు చేయటం అలవాటయిపోయిందం'టూ విసుక్కుని పెద్దమ్మ కళ్ళజోడు పెట్టుకొని ఆ ఉత్తరాన్ని చదివి నిర్ఘాంతపోయింది! పెద్దమ్మ చేతినుండి జారి క్రిందపడిన కాగితాన్ని తీసుకుని నేనూ చదివాను. తమాషా ఏం లేదు... అందులో అలాగే ఉంది!

శ్రీలక్ష్మి పెద్దమ్మ ఒడిలో తలదాచేసుకుంది.

పెద్దమ్మకి దుఃఖం, ఆవేశం పెరిగిపోయాయి. 'శ్రీలూ.. ఇదంతా నిజమని నువ్వు నమ్మకు. వాడేదో తమాషాకి నిన్ను ఏడిపించాలని అనుకుని అలా రాసివుంటాడంతే. చిన్నప్పటి నుండి తననే మనసులో నిలుపుకుని... ప్రాణానికి ప్రాణంలా ప్రేమిస్తున్న నిన్ను కాదని... వేరొకరి మెడలో మూడు ముళ్ళు ఎలా వేస్తాడు... నేనెలా

ఒప్పుకుంటాను..? నువ్వు కాకుండా ఈ ఇంటికి పెద్దకోడలుగా... ఎవరూ.. ఇంకెవరూ... రాలేరు. అవసరం అయితే నేను ఆజ్ఞలాగే చెబుతాను నా మాట కాదని ఏ చిన్నపని అయినా.. ఎపుడయినా చేశాడా... ఇప్పుడూ అంతే..” అని పెద్దమ్మ అంటోంటే శ్రీలక్ష్మికీ ఏడుపు తన్నుకు వచ్చేసింది.

“వద్దు... అత్తమ్మా... అలా మాట్లాడకు. బావ చేసిన పనిలో తప్పేమి లేదు. బావ ప్రేమించిన అమ్మాయితోనే పెళ్ళికి అంగీకరించాలి...” అంటూ వెక్కిళ్ళు పెట్టింది.

‘ప్రేమేమిటి... చిన్నప్పటి నుండీ నిన్ను ప్రేమించలేదూ? ఇపుడు ఇంకెవరిమీదో కొత్తగా అంత ప్రేమ పుట్టుకొచ్చేసిందా..? నేను ఎప్పటి నుండో పెళ్ళి పనులు కూడా మొదలు పెట్టాక.. ఇపుడిలా అంటాడా...! నగలు చేయించటం దగ్గర్నుండి ఎన్ని పనులు చేసుకువస్తున్నాను! నేను వాడికి ఖచ్చితంగా చెబుతాను.. ఇంకెవరినో చేసుకుంటే తనకి భార్య వస్తుందేమో గానీ... నాకు మాత్రం కోడలు కాదని... కాలేదని!’

పెద్దమ్మ మాటలకు శ్రీలక్ష్మి ఇంకా కదిలిపోయి కన్నీళ్ళు పెట్టింది. పెద్దమ్మ చేతిని తన చేతిలో పెట్టుకుని “బావ ఇష్టపడిన అమ్మాయితోనే బావ పెళ్ళి జరగటానికి నువ్వు అంగీకరించాలి. మనసులో కోపం పెట్టుకోకుండా పెద్ద కోడలికని చేయించిన నగలన్నీ ఆ అమ్మాయికే ఇవ్వాలి. నాకు మాట ఇచ్చావు...” అంది.

‘ఎందుకిలా మీరిద్దరూ తొందరపడిపోతున్నారు? అన్నయ్య ఉత్తరంలో రాసింది తమాషానా, లేక నిజంగా నిజమేనా... ఇవన్నీ అన్నయ్య వచ్చాక వివరాలు తెలుసుకున్నాక మాట్లాడుకోవచ్చుగా?’ అన్నాను నేను.

పెద్దమ్మ తలవూపుతూ ‘అవును శ్రీలూ... నీరజ చెప్పిందీ నిజమే. విష్ణు వచ్చాక అసలు సంగతేమిటో అడుగుదాం. నాకు బాగా తెలుసు. నా మనసు కష్టపెట్టే చిన్న పనయినా విష్ణు చేయలేడు. నాకిష్టం లేదని చెబితే వాడికిష్టమైన పని అయినా మానేస్తాడు! నీకు మాత్రం తెలియదా... నేను కొత్తగా చెప్పాలా..’ అంటూ ఒడిలో తలపెట్టి పడుకున్న శ్రీలక్ష్మి తల నిమురుతూ అనునయించింది.

అమ్మతో అయినా, పెద్దనాన్నతోగానీ ఈ మాట ఎక్కడా అనవద్దని పెద్దమ్మ నాకు వార్నింగ్‌లా చెప్పింది. ‘అలాగే’ అన్నాను.

ఒకరు బాధపడితే మరొకరు తట్టుకోలేరనే ఉద్దేశ్యంతోనే కాబోలు, పెద్దమ్మ. శ్రీలక్ష్మి ఇద్దరూ పైకి మామూలుగా కనుపించటానికి ప్రయత్నం చేశారు.

* ❀ *

మరునాడు ఉదయం....

'శ్రీలూ... శ్రీలక్ష్మి....' అంటూ పెద్దమ్మ పెట్టిన కేక శ్రీనిలయం అంతా ప్రతిధ్వనించింది. అందరం పైకి పరుగులు పెట్టాం.

పెదనాన్న కోసం తెచ్చి ఉంచిన నిద్రమాత్రలు మింగి శ్రీలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది.

విషయం తెలిసి... ముందు పెదనాన్న కొయ్యబారిపోయారు. మరుక్షణమే 'ఈ ఇంటి దేవత... మా .. శ్రీ... మహాలక్ష్మి వెళ్ళిపోయిందా...' అంటూ పెదనాన్న విరుచుకుపడిపోయారు. పెరాలసిస్ వచ్చింది.

పెద్దమ్మకి స్పృహ తప్పింది. ఇల్లంతా గందర గోళమైపోయింది.

అంతలో అనుకోకుండా విష్ణు అన్నయ్య వచ్చాడు. పరిస్థితి చూసి అయోమయమై పోయాడు. కాసేపటిలోనే పెద్దమ్మకి స్పృహ వచ్చింది. రోదిస్తూనే అన్నయ్యను పట్టుకుని నిలదీసింది.

'నువ్వు ప్రేమించిన అమ్మాయితో నీ పెళ్ళి జరగటానికి వీలుగా, అడ్డుగా ఉండకూడదని శ్రీలక్ష్మి వెళ్లిపోయిందిరా... నువ్వు లేని జీవితం వద్దనుకుంది.. మా గురించి ఆలోచించకుండా... నీ సుఖం కోరి... వెళ్ళిపోయింది...' అలా పెద్దమ్మ ఏడుస్తుంటే అన్నయ్య తలవొంచుకుని కన్నీళ్ళు కారుస్తూ ఉండిపోయాడు.

'ఇలా జరుగుతుందని... ఊహించలేకపోయాను..' అని ఒకే ఒక్కమాట అన్నాడు.

'చిన్నప్పటి నుండీ నిన్నే భర్తగా భావించిన అమ్మాయి... నువ్వు కాదంటే ఏమైపోతుందని ఎందుకు ఆలోచించలేదురా..? ఈ ఇల్లు కట్టినపుడు.. పెద్ద కోడలి పేరుతో కలిపి శ్రీ నిలయం అని పెట్టామని మీ నాన్నగారు అందరితో చెప్పటం వినలేదూ..? బంధువులు, స్నేహితులు.. అందరితో శ్రీలక్ష్మి మా కాబోయే పెద్ద కోడలని మేం చెప్పటం నువ్వెన్నిసార్లు వినలేదూ..? ఒక్కసారైనా ఇన్నేళ్ళల్లో నీకిష్టం లేదని చెప్పావా... ఇపుడు హఠాత్తుగా నీ అభిప్రాయం మార్చుకొని ఆ అమాయకురాలి మనసును ముక్కలు చేశావ్...' పెద్దమ్మ ఆరోపణల్ని ఖండించలేని వాడిలా అన్నయ్య నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

పెదనాన్నని హాస్పటల్‌లో చేర్చారు.

ఆ రోజుని తలుచుకుంటే... నాకు ఇప్పటికీ వెన్నులోంచి వణుకు వచ్చినట్లుగా భయంగా... బాధగా ఉంటుంది... శ్రీలక్ష్మి అంటే అందరికీ అభిమానమే. ఊళ్ళోని తెలిసిన వాళ్ళందరూ వచ్చేశారు. ఇల్లు కిటకిటలాడిపోయింది. పెదనాన్న హాస్పటల్‌లో ఉన్నారు. ఇక్కడ ఇంట్లో మాటిమాటికీ ఏడుపులతో పెద్దమ్మకి స్పృహ తప్పుతూ ఉంది. అన్నయ్య అయితే పాపం నిజంగా మతిపోయిన వాడిలాగే అయిపోయాడు".

ఇక చెప్పేందుకేమీ లేదన్నట్లుగా చెంపలమీదుగా జారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ ఉండిపోయింది నీరజ. రెండు క్షణాలు అలా నిశ్శబ్దంగా గడిచాక ఆల్బమ్ తీసుకుని వెళ్ళిపోయింది.

దిగ్భ్రాంతితో శిలలా కూర్చుండిపోయిన నాలో కాసేపటికిగానీ చలనం రాలేదు. కన్నీటితో నా చెంపలూ తడిసిపోయాయన్న విషయం గమనింపులోకి వచ్చింది. శ్రీలక్ష్మితో నాకెటువంటి బాంధవ్యం లేకపోయినా... మరణవార్త నన్ను బాగా కలచివేసింది. సహజమరణం కాకుండా ఆత్మహత్య కావటం... మరింత వేదనని కలిగించింది.

కన్నీళ్ళు ఆగటం లేదు... దుఃఖంతో పక్కమీద వాలిపోయాను.

నా భ్రమలూ.. తెరలూ తొలగిపోయాయి..! నిజాలు తెలిసి వచ్చాయి.

శ్రీలక్ష్మి.. పేరుని విని.. ఎవరో బాగా తెలిసిన వాళ్ళ అమ్మాయో... బంధువుల అమ్మాయో అనుకున్నాను. చిన్నప్పటి నుండే విష్ణు కాబోయే భార్యగా ఈ ఇంట్లోనే శ్రీలక్ష్మి పెరిగిందా... అపురూపమైన అందమే కాదు, అంతటి మంచి మనసూ ఉన్న శ్రీలక్ష్మిని విష్ణు ఎందుకు కాదన్నారు... కేవలం నన్ను ప్రేమించటం వలనేనా...?! ఇది.. నిజంగా... నమ్మ లేని నిజమా..?

అత్తయ్య నన్ను దూరంగా ఉంచటానికి కారణం ఇపుడు స్పష్టమైపోయింది! నేను విష్ణుకు భార్యనేగానీ అత్తయ్య మాత్రం తన కోడలిగా అంగీకరించలేదు... అందుకు ఆమె మనసు ఒప్పుకోదు. నిజమే... ఆమె దుఃఖంలో న్యాయముంది.

నేను అనుకోకుండా.. సరిగ్గా శ్రీలక్ష్మిలాగే 'అత్తమ్మా' అని పిలవటాన్ని తట్టుకోలేక పోయారు... శ్రీలక్ష్మిని గుర్తుచేస్తూ అలా పిలిచే అర్హత నాకు లేదని ఖచ్చితంగా చెప్పేశారు.

నన్ను చూడగానే అందరిలోనూ కనుపించిన ఆశ్చర్యానికి అర్థం ఇప్పటికి నాకు తెలిసింది! శ్రీలక్ష్మిని కాదని విష్ణు ప్రేమించి పెళ్ళి చేసుకున్న అమ్మాయి ఇంకెంత

అందంగా ఉంటుందో అని అందరూ అనుకుని ఉంటారు. నన్ను చూడగానే వాళ్ళ అంచనా తప్పిన ఆశ్చర్యం అదన్నమాట!

శ్రీలక్ష్మి, విష్ణు చెన్నూరు నుండి వచ్చినపుడు బంధువులావిడ సరదాగా పేర్లు చెప్పమని అడిగితే ఏమిటీ పద్ధతులంటూ విష్ణు చిరాకుపడిన సంగతి.. మేమిద్దరం ఈ ఇంటికి వచ్చిన రోజు గుమ్మం దగ్గర అందరూ పేర్లు చెప్పమని పరిహాసాలు చేస్తున్నపుడు అత్తయ్యకు గుర్తుకువచ్చి చిరాకు పడ్డారు కాబోలు! సహజమే మరి!

శ్రీలక్ష్మిని పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యం లేనపుడు ఆ విషయం అత్తయ్యతోనైనా విష్ణు ఎందుకు చెప్పలేదు? అత్తయ్య దగ్గర బెరుకు, భయం ఏమీ లేవు. పైగా ఎంత చిన్న పని అయినా సరే తల్లికి చెప్పటం, అన్ని ఆలోచనలు పంచుకోవటం చిన్నప్పటి నుండీ విష్ణుకున్న అలవాటని విష్ణు మాటల ద్వారా నేనూ గ్రహించాను. మరి శ్రీలక్ష్మి విషయంలోనే విష్ణు ఎందుకిలా ప్రవర్తించారు?

కొన్ని విషయాలు చెప్పాలి... సమయం చూసుకుని చెబుతాను అని విష్ణు ఇంతకుమునుపు అన్నారు. అంటే శ్రీలక్ష్మి విషయమేనా..?

విష్ణు శ్రీలక్ష్మిల పెళ్లి కాదేమోననే సందేహం బంధువుల్లో ఎవరికీ లేదు. శ్రీలక్ష్మి లాంటి అమ్మాయిని ఎవరైనా ఎందుకు కాదంటారు..? అందుకేనేమో నా స్నేహితురాలు వనజ అత్తగారు 'ఇది నా అత్తగారిల్లు' అని చెప్పినపుడు ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళు మీనాక్షమ్మ చేసేసిందా అని విస్తుపోయారు, అంటే... ఆవిడ నన్ను రెండో కోడలిగా పొరబడిందని ఇపుడు తెలుస్తోంది. బంధు మిత్రులందరికీ కూడా శ్రీలక్ష్మే ఈ ఇంటి పెద్ద కోడలని అంత నమ్మకం ఉందన్నమాట'.

ఆ రోజు నాకు నగలన్నీ చూపిస్తూ చిన్నత్తయ్య మాటిమాటికీ నిట్టూర్చటం నాకు గుర్తుకు వచ్చింది. శ్రీలక్ష్మి కోసం చేయించిన నగలు నాకు ఇవ్వాల్సి వచ్చినందుకే ఆవిడ ఎవరికేది ప్రాప్తమో అనుకున్నారు కాబోలు.

అత్తయ్య తన దగ్గరే అపురూపంగా, గారంగా పెరిగిన శ్రీలక్ష్మి కోసం.. కాబోయే కోడలని.. అలా ఎప్పటి నుండో అన్ని నగల్ని చేయించి ఉంచారు. శ్రీలక్ష్మి చనిపోయాక.. మా ప్రేమే తన మరణానికి కారణమని తెలిసినా... మా పెళ్ళికి అత్తయ్య అభ్యంతరం చెప్పకపోవటానికి కారణం... శ్రీలక్ష్మికి మాట ఇవ్వటమే! ఆ మాట ప్రకారమే ఆ నగలన్నీ నాకు పంపించారు. నేనేమో... అత్తయ్య వాళ్ళ స్థాయికి తగిన కుటుంబం

నుండి వచ్చిన దానిని కాదనే చిన్నచూపుతో అత్తయ్య నాకు స్వయంగా నగలు ఇవ్వలేదనీ... తమ స్థాయి, సాంప్రదాయం కోసమే పంపించారని అనుకున్నాను!

ఆ రోజు.. బంధువుల పెళ్ళికి వెళ్ళి వస్తూ నన్ను చూడటానికి వచ్చిన వాళ్ళది చెన్నూరే. అంటే... అత్తయ్య తరపు వాళ్ళు... శ్రీలక్ష్మికీ దగ్గర బంధువులే వాళ్ళందరూ. శ్రీలక్ష్మిని కాదని విష్ణు నన్ను చేసుకున్నందుకు వాళ్ళందరికీ నా పట్ల అయిష్టం ఉండటం సహజమే! విష్ణు ఏ కోటీశ్వరుల అమ్మాయినో చేసుకుని ఉంటే ఆస్తిపాస్తుల కోసం ఆశపడ్డాడని సరిపెట్టుకునే వాళ్ళేమో! అలాకాకుండా ఓ మాష్టారి అమ్మాయిని చేసుకోవటం వాళ్ళకి అర్థం కాని విషయమే! అందుకే వాళ్ళు నా పట్ల కలిగిన చులకన భావాన్ని ఏమాత్రం సంకోచించకుండా మాటల్లో చూపించేశారు!

ఇపుడు ఆలోచిస్తుంటే... అందరి ప్రవర్తనా సమంజసంగానే అనిపిస్తోంది! నాదే... కేవలం నాదే తప్పు. తెలియకుండా అయినా సరే, నేనే శ్రీలక్ష్మి మరణానికి కారణమయ్యాను. విష్ణు.. ఎందుకు చేశారిలా...?

నీరజ మాటలని బట్టి అత్తయ్య, శ్రీలక్ష్మిల మధ్య ఉన్న అనుబంధం ఎంత గాఢమైనదో అర్థమౌతోంది! శ్రీలక్ష్మి మరణానికి పరోక్షంగా కారణమైన నేను... విష్ణు పక్కన శ్రీలక్ష్మి స్థానంలో ఉండి నవ్వుతూ తుళ్ళుతూ కనుపించటాన్ని అత్తయ్య భరించలేకపోయారు. మనసులో ముల్లు గుచ్చుకున్నట్లుగా విలవిలలాడిపోయారు! మా గది సరిగ్గా తన గదికి ఎదురుగా ఉండటంతో తరుచూ నన్ను చూడాల్సి రావటాన్ని సహించలేకనే బెడ్‌రూముని క్రిందకు మార్పించుకున్నారు. అదీ అసలు విషయం.

నేను నేనుగా ఉండకూడదని... నన్నెవరో... పదునైన ఆయుధంతో నిర్దాక్షిణ్యంగా... ఖండఖండాలుగా... కకావికలం చేస్తున్నట్లుగా.. ఏమిటీ బాధ..? ఎలా తట్టుకోవాలి..?

అత్తవారిల్లు.. ఈ శ్రీ నిలయంలా... ఇంద్రభవనంలా ఉండాలని కలలో కూడా నేను కోరుకోలేదు.

నన్ను అభిమానించేవాళ్ళు నలుగురు ఉండే ఇల్లు... ఆప్యాయతానురాగాలు పరిమళించే పొదరిల్లు.. కావాలని మాత్రమే నేను కలలు కన్నాను.

నా కోరిక... ఎందుకిలా గగన కుసుమం అయిపోయింది?

నేను ఎప్పటికీ... ఇలా వీళ్లందరిలో... దోషిలా నిలబడాల్సిందేనా..? అపరాధ భావంతో కృంగిపోతూ... రోజులు భారంగా దొర్లించాల్సిందేనా..?!

ఎందుకు విష్ణూ... నాకిలాంటి శిక్ష వేశారు..?

కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.. దిండు తడిసిపోయింది.

అలసిపోయిన కనురెప్పలు మూతబడ్డాయి.

... అడుగు చప్పుడుకి నా కలత నిద్ర చెదిరిపోయింది.

విష్ణు వచ్చినట్లున్నారు. బాత్‌రూముకి వెళ్ళటం, రావటం తెలుస్తూనే ఉంది. నేను మాత్రం అలాగే పడుకుని ఉండిపోయాను.

ఉదయమే సర్ది ఉంచుకున్న సూట్‌కేసులో కాగితాలేవో పెట్టుకున్నారు కాబోలు, సూట్‌కేసును మూసేస్తూ "ఈ వేళపుడు పడుకున్నావేంటీ?" అన్నారు.

నేను మాట్లాడలేదు. "మెలకువగానే ఉన్నావని తెలుస్తోందిగానీ ఇక లే..." అంటూ పక్కకు వచ్చి కూర్చున్నారు. "ఈ నాలుగు రోజులూ మీ ఇంటికి వెళ్తావా?" అంటూ నా మీద చేయి వేసిన విష్ణు సెల్ ఫోన్ మోగితే తీసుకోవటానికి లేచారు.

నేను అటు పక్కకి తిరిగాను.

ఒక అడుగు అటువేసిన విష్ణు "ఏమిటి సుజీ... ఏమైంది... బాగా ఏడ్చినట్లుగా ఎందుకలా ఉన్నావ్...?" ఆదుర్దాగా అడుగుతూ బెడ్ దగ్గరికి వచ్చారు.

నేను లేచి నిలబడ్డాను.

నా మనసులో సుళ్ళు తిరుగుతున్న ప్రవాహం కట్టలు తెంచుకుని బయటకు పొంగివచ్చింది! విష్ణు రెండు భుజాలు పట్టుకుని "శ్రీలక్ష్మి గురించి... ముందుగా నాకెందుకు చెప్పలేదు?" నిలదీస్తున్నట్లుగా అడిగాను.

విష్ణు విభ్రాంతిగా చూసి... ఒక నిముషం కళ్ళు మూసుకుని తెరిచారు.

"శ్రీలక్ష్మి గురించి... తన మరణవార్త గురించి... పెళ్ళికి ముందు నీకు చెప్పటం అవసరమని నేను అనుకోలేదు. సమయం చూసి నిదానంగా ఎపుడో చెబుదామనుకున్నాను. ఈ విషయం నువ్వు ఈ ఇంటికి వచ్చిన రోజే చెప్పాను...." విష్ణు గొంతు గద్గదమైంది.

విష్ణు భుజాలను పట్టుకున్న నా చేతులు ఇంకా బిగిసాయి.

ఆవేశం... ఆవేదన పెరిగిపోయాయి. "ఎందుకు విష్ణు... ఎందుకు చేశారిలా? ఈ ఇంట్లో అందరి మధ్యా నన్ను దోషిగా ఎందుకు నిలబెట్టారు? మీతో కలిసి జీవించలేకపోతే, ఇంక జీవితమే అనవసరమనుకునేంతంగా మిమ్మల్ని ప్రేమించిన

శ్రీలక్ష్మిని... చిన్నప్పటి నుండీ మిమ్మల్నే భర్తగా తలుచుకుని... అందరి మధ్య ఈ ఇంటి కాబోయే కోడలిగా పెరిగిన శ్రీలక్ష్మిని... ఎందుకు కాదన్నారు.. ఎలా అనగలిగారు...? మీకు అన్యాయమనిపించలేదా..?"

విష్ణు మొహంలో... ఒక క్షణం అమితమైన ఆవేదన రెపరెపలాడింది, నిస్సహాయంగా చూస్తూ "సుజీ... అది...ఎలా చెప్పాలో తెలియటం లేదు..." అంటోంటే నేను అడ్డం వెళ్ళాను.

"ఈ ఒక్క మాటకి సమాధానం చెప్పండి. శ్రీలక్ష్మి అంటే మీకూ చిన్నప్పటి నుండీ ఇష్టమే కదూ...? మన పరిచయం వరకూ శ్రీలక్ష్మిని పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంతోనే ఉన్నారు కదూ..? చెప్పండి..." ఆవేశంతో విష్ణును వూపేస్తూ అడిగాను.

"అ...వు...ను"

విష్ణు నోటి వెంట ఆ సమాధానం రాగానే నా ప్రపంచం ఒక్కసారిగా తల్లక్రిందులైపోయినట్లయింది! చీకట్లు కమ్ముకున్నాయ్! విష్ణును పట్టుకున్న చేతుల్లోని శక్తి అంతా హరించుకుపోయింది.

క్రిందకు నేల మీదకు జారిపోయాను.